నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో బుధవారం జరిగిన నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభలో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న జనం

బోధన్ కేరింత.. ఇందూర్ పులకింత

- మెదక్, నిజామాబాద్ అర్బన్, బోధన్, ఎల్లారెడ్డిలో సీఎం కేసీఆర్‌కు బ్రహ్మరథం
- ప్రజాఆశీర్వాద సభలకు పోటెత్తిన జనం
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్ నవంబర్ 15: ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి, మెదక్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన మూడు సభలు వేటికవే పోటీ అన్నట్టుగా జరిగాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కొక్క సభలో దాదాపు గంటసేపు గడిపారు. ఈ సభలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఆయా సభలకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్న దృశ్యాలు కనిపించాయి. అందుబాటులో ఉన్న వాహనాలను ఎక్కి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పిల్లాపాపలతో మహిళలు, వృద్ధులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయా సభల్లో 'జై కేసీఆర్.. జై బీఆర్ఎస్.. జై కిసాన్' నినాదాలు మార్మోగాయి. 'జై కేసీఆర్.. జయహో కేసీఆర్' అంటూ యువత నినదించారు. తొమ్మిదిన్నరేండ్లలో సాధించిన ప్రగతి, సంక్షేమ ఫలాల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

బోధన్ జనమయం

> దారులన్నీ బోధన్ వైపే అన్నట్టుగా బోధన్ నియోజకవర్గ సభ విజయవంతమైంది. ఈ సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేసీఆర్ కటౌట్లు, భారీ గులాబీ జెండాలను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ర్యాలీగా తరలివచ్చి సభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆకలించారు.

ఇందూర్ పులకింత

ప్రజా ఆశీర్వాద సభతో ఇందూర్ గడ్డ పులకించింది. ఈ సభ ప్రతిపక్ష పార్టీల్లో వణుకు సృష్టించింది. కేసీఆర్ సభతో పోల్చుకుంటే అక్టోబర్ 3న ప్రధాని మోదీ నిర్వహించిన సభ వెలవెలబోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మోదీ సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలను తరలించగా.. కేవలం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ప్రజలతోనే ప్రజా ఆశీర్వాద సభ కిక్కిరిసింది. మైనార్టీలు సైతం ఈ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణలో మైనార్టీలు సాధించిన అభివృద్ధిని కండ్లకు కట్టారు. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని కేసీఆర్ వివరించడంతో అంతా శ్రద్ధగా విన్నారు. కేసీఆర్ బతికున్నంత కాలం సెక్యులరిజాన్ని కాపాడతానంటూ చెప్పడంతో సభికులంతా చప్పట్లు కొట్టారు.

కిటకిటలాడిన మెదక్ సభ

మెదక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన మెదక్‌లోని సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో నిర్వహించిన సీఎం ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మెదక్ పట్టణానికి వచ్చే రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం 3 గంటలకే సభా ప్రాంగణానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, సీఎం రాక కోసం ఓపికగా నిరీక్షించారు. సాయంత్రం 5 గంటలకు సీఎం కేసీఆర్ వేదిక మీదకు రావడంతోనే ఈలలు, కేకలతో సంతోషం వ్యక్తం చేశారు. 'జై కేసీఆర్.. జై తెలంగాణ' అంటూ సభలో యువకులు, మహిళలు నినదించారు. కేసీఆర్, హరీశ్‌రావు, పద్మాదేవేందర్ రెడ్డి చిత్రాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని మహిళలు, యువకులు నృత్యాలు చేశారు. సభలో మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పరవశం

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గులాబీ పార్టీ పరవశించి పోయింది. ప్రజా ఆశీర్వాద సభకు గిరిజనులు, కాయితి లంబాడీలు భారీగా వచ్చారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యం ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించిన సీఎం సభ గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. అత్యధికులు బైకులపై సభకు తరలిరావడం విశేషం. పొడవాటి జెండాలను చేత పట్టుకుని కేసీఆర్‌కు అడుగడుగునా అభివాదం చేస్తూ అభిమానులు సంబురపడ్డారు. ఎల్లారెడ్డి సభలో కాయితి లంబాడీల రిజర్వేషన్ డిమాండ్ కోసం తాను కూడా పోరాటం చేస్తానంటూ కేసీఆర్ చెప్పడంతో ఆ వర్గంలో ఆనందం వెల్లివిరిసింది.

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం జరిగిన నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రసంగానికి చెయ్యెత్తి మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

కోస్గిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

ఓటమి భయంతోనే రేవంత్ దాడులు

- సర్జఖాన్‌పేట్‌లో కాంగ్రెస్ దాడిని ఖండిస్తున్నాం
- మీడియా సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 15: ఇటీవల కొడంగల్‌లో మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు వచ్చిన జనాలను చూసి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే కిరాయి గూండాలతో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని భూగర్భ, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓపిక పడుతున్నామని, తమ జోలికొస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీలో ఉన్న ఫామ్‌హౌజ్‌లో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కిరాయి మనుషులను తీసుకొచ్చి.. కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేట్‌లో సోమశేఖర్ రెడ్డి అనుచరులపై పథకం ప్రకారం దాడి చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఐదేండ్లుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారని, ఇక్కడ ఆయన గెలుపు ఖాయమని తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలు కుంద్రు విజయ్‌కుమార్, మైబులను మంత్రి పరామర్శించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి లింగంపల్లి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar:Hyderabad-30, Telangana State, India
NOTIFICATION FOR ADMISSION INTO PG and Ph.D. COURSES UNDER ICAR 30% QUOTA FOR THE ACADEMIC YEAR-2023-24
Advt.No.4239-(1)/PG/2023 DATED: 15-11-2023
ONLINE applications are invited from eligible candidates for admission into PG and Ph.D. courses under ICAR 30% quota for the academic year 2023-24 as approved by competent authority of ICAR. The online counselling brochure and other details are available on University website: www.pjtsau.edu.in.
Sd/- Venkata Ramana, Registrar
DIPR RO.No. 8319-PP/CL/ADVT/1/2023-24, Dt: 15-11-2023

వివేక్ కంపెనీ నుంచి రామగుండం షెల్ కంపెనీకి 8 కోట్లు బదిలీ

- బీఆర్ఎస్ నేతలను, ప్రజలను కొనడానికి ప్రయత్నాలు
- ఆయన సంస్థలపై ఎన్నికల సంఘం నిఘాపెట్టాలి
- చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థిపై ఎన్నికల సంఘానికి బాల్క సుమన్ ఫిర్యాదు

సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న విప్ బాల్క సుమన్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి చెందిన విశాఖ ఇండస్ట్రీస్ అకౌంట్ నుంచి రామగుండంలోని విజిలెన్స్ సెక్యూరిటీస్ ప్రైవేట్ కంపెనీకి రూ.8 కోట్లు బదిలీ చేశారని, ఆ నిధులతో ఓటర్లను, బీఆర్ఎస్ నాయకులను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఆరోపించారు. వివేక్ కంపెనీ నుంచి ఇంకా నిధులు బదిలీ చేసే అవకాశం ఉన్నదని, దీనిపై వెంటనే విచారణ చేసి బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయాలని కోరారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిధుల బదిలీపై ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ సెక్యూరిటీస్ ప్రైవేట్ కంపెనీ డైరెక్టర్లుగా వివేక్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులే ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు వ్యాపారులకు బ్యాంకు అకౌంట్ నుంచి నిధులు బదిలీ చేసి వారి దగ్గర నగదు తీసుకోవడానికి వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సహకరించవద్దని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. వివేక్ కుటుంబ సభ్యులతోపాటు వెలుగు దినపత్రిక, వీ6 చానల్ సిబ్బంది మొత్తం చెన్నూరు నియోజకవర్గంలోనే పనిచేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని వివేక్‌కు సవాల్ చేశారు. అంగీలు మార్చినట్టుగా పార్టీలు మార్చే వివేక్‌కు నీతి, నిజాయతీ, నిబద్ధత అంటూ ఏమీ ఉండవని విమర్శించారు. బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉండి ఆ పార్టీకి ద్రోహం చేశారని దుయ్యబట్టారు. వివేక్ తన తండ్రినే సరిగా పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్ల నిధులు తెచ్చిన చరిత్ర తనదని, ఎన్నికల్లో గెలవడానికి కోట్లు తీసుకొస్తున్న చరిత్ర వివేక్‌ది అని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి కే రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.